రామమూర్తి పంతులుగారితో 36 గంటలు

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

నవంబరు యిరవై మూడో తేదీ, శనివారం, సాయంత్రం, రమారమి యెనిమిది గంటలవేళ, పర్లాకిమిడిలో, నేను, రావుసాహేబు శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారి యింటికి వెళ్ళాను — ఇరవై అయిదో తేదీ, సోమవారం, ఉదయం, అలాగే యెనిమిది గంటలవేళ, మళ్ళీ అక్కణ్ణుంచి బయలుదేరాను

ఈ 36 గంటలనూ నేను వెలకట్టలేను నా జీవితంలో, యింతవరకూ, నేనిలాంటి సమయం గడిపి యెరగను ఇకముందు కూడా గడపబోను.

పంతులుగారి కటాక్షవీక్షణం నామీద ప్రసరించినంతసేపూ యేదో అపూర్వ శక్తి వొకటి నాలో జాగరితం అవుతూ వున్నట్టు తోచింది. తెలుగు భాషను గురించిన సమ్యగ్జ్ఞానం నా మెదటిలో సంచితం అవుతూ వున్నట్టు కూడా అనిపించింది.

ఆంధ్రదేశానికి నూత్న సందేశం వెలువడ్డ ఆ గదిలో కూచుని వుపదేశం చేస్తూ వుండగా పంతులుగారి దివ్య దర్శనం చేసుకున్నాను. నా జన్మ సఫలం అయింది

నేను వెళ్ళేటప్పటికి, పంతులుగారు, టేబిలుముందు కూచుని ఫలాహారం చేస్తున్నారు" రాజమండ్రీనుంచి యెవరో వచ్చా"రని మాతృశ్రీ, అన్నపూర్ణమ్మగారు మనవి చెయ్యగా వారు, వెనక్కి తిరిగి చూశారు. వెంటనే నేను నమస్కారం చెయ్యగా అందుకున్నారు, గాని నన్నానవాలు కట్టలేకపోయారు.

రాజమహేంద్రవరంలో వారికి సన్మానం జరిగాక మళ్ళీ నేనిదే వారి దర్శనం చెయ్యడం

ఇది యిలాగే జరుగుతుందని నేను చేతిలోనే వుంచుకుని వున్న కార్డు అందించాను. వెంటనే వారు, గభీమని లేచి "అలాగా? చాలా సంతోషం" అంటూ నా భుజంమీద తట్టి, కొంచెం దూరంలోవున్న కుర్చీ తెచ్చి వేసి కూచోమన్నారు. నేనే అది తెచ్చుకోవాలని ప్రయత్నించాను; గాని ఆ పులిపంజాలలో

వున్న కుర్చీని నేను స్వాధీనపరుచుకో లేక పోయాను

నన్ను చూశారు. అప్పటిదాకా ఫల హారం చేస్తూ, పూసిపోడానికి మూలు గుతూ వున్న పంతులుగారు, గ్రాంథిక వాదులలో కొమ్ములు తిరిగిన వారి తప్పుడు రచనల ప్రస్తావన ప్రారంభిం చారు.

అవి గ్రాంథిక వాదుల అప ప్రయో గాలే కాదు, అర్థం లేని ఆక్షేపణలే కాదు, కుట్రలే కాదు, కుత్సితాలే కాదు, అశక్త దుర్దర్శనలే కాదు—అది అఖండ గోదావరి నిండు ప్రవాహం.

ఈ కారణంవల్ల, తరువాత, పది నిమిషాలలో పూర్తి కావలసిన ఫలహా రానికి ముప్పావుగంట పట్టింది

తరవాత నేను భోజనం చేసి వారితో కూడా మేడమీదకి వెళ్ళాను

ఆ గదిలో వొకచోట సవరనిఘం టువు చిత్తులు, ఒక చోట తయారులో వున్న సాపులు ఒకచోట ప్రూఫులు. ఒకచోట నాలుగైదు రోజులుగా వచ్చిన తెనుగు పత్రికలు, ఎదటి గూట్లో అరవం కన్నడం, మరాఠి, ఇంగ్లీషు, జర్మనీ, ఫ్రెంచి వగైరా భాషల బృహన్నిఘంటు వులు.

వాటిమధ్య, శరీరం అంతా చిత క్కొట్టబడ్డ పీరమ్మన్యుడులాగ పడివున్న శబ్దరత్నాకరం

ఆ గదిలో కార్యస్థానపు లక్షణాల కంటే యుద్ధరంగపు లక్షణాలే యెక్కు వగా వున్నాయి.

మళ్ళీ కబుర్లు మొదలయినాయి.

బ్రహ్మశ్రీ (మారేపల్లి రామచంద్ర) కవిగారి ప్రస్తావన వచ్చింది.

వెంటనే లేచి, పంతులుగారు, నా చెయ్యి పట్టుకుని వసారాలోనికి తీసుకు వెళ్ళి, గడమంచీ మీద వున్న ఖండెడు తాటాకు పుస్తకాలూ చూపిస్తూ "కవి గారికి విశాఖపట్నం జిల్లావారు షష్టిపూర్తి మహోత్సవం చెయ్యడం బాగానే వుంది; కాని వారి ఘనుతకా గౌరవం చాలదు వారి పేర, యలమంచిలో, బోర్డు యాజ మాన్యం కిందగాని విశాఖపట్నంలో మునిసిపాలిటీ పెత్తనంలోగానీ వొక పుస్తక భాండాగారం స్థాపించి, రిజిస్టరీ చేయించేటట్టయితే నేనీ తాటాకు పుస్తకా లన్నీ ఆ భాండాగారానికిస్తాను సీతాపతి యింటో లేకపోవడం మీరు చూస్తూనే వున్నారు విశాఖపట్నం వెళ్ళి నేనా మహోత్సవం కళ్ళారా చూడవలసిన వాణ్ణే కాని ఇల్లు కదలలేని స్థితిలో వున్నాను మీరు వెడుతున్నారు కనక యీ సంగతి మీ మాటలతో మహాసభలో చెప్పండి" అని సెలవిచ్చారు.

తరవాత, వారి, యీ సందేశం, నేను విశాఖపట్నంలో మహాసభలో ప్రకటిం చాను.

అదివరకే నేను, కవిగారు గొప్ప పండితులని యెరుగుదును; కాని పంతులు గారి యీ సందేశంవల్ల నాకు కవిగారి పదవి మరింత మహోన్నతంగా కనపడింది.

ఇవాళ, తెనుగు దేశంలో, ఆంధ్ర పండితుల తారతమ్యం తెలుసుకోవా లంటే, అందుకు రామమూర్తి పంతులు గారి నిర్ణయం వొక్కటే ఆధారం.

తరవాత వీరేశలింగం పంతులుగారి శిలావిగ్రహం సంగతి వచ్చింది. "రేపది రాజమహేంద్రవరంలో మహోత్సవంతో ప్రతిష్ఠించబడుతోంది కదా మీరు అలా వచ్చేవాళ్ళే"రేమని పంతులుగా రడిగారు "ప్రబుద్ధాంధ్ర నన్నింటో వుండనివ్వడం లే"దని రాసి చూపించాను "ఔనౌను. మీ ప్రచారంసంగతి విన్నాను. ప్రబుద్ధాంధ్రకు, సంపాదకుడు నెలకు ఇరవై రోజులచొప్పున ప్రెస్సు బిల్లూ పేపరు బిల్లూ పూర్తిగా చెల్లకపోతూ వుండడం దేశీయుల గాఢ నిద్రకు నిదర్శనం అయితే: ఈ వూళ్ళో మీరు మా యింటో బసచేయడం బాగా లేదు ఏమంటే? అన్ని విధాల మాకీ వూళ్ళో వెలి. ఈ వూరి తాపీపనివాడెవడూ మా యింటో పనిచెయ్యడానికిరాడు వస్తే, తరవాత, కంట్రాక్టర్లూ రాజాగారి పోష్యవర్గంలో వారూ వాణ్నిక చేర నివ్వరు. పెంకులమ్ముకునే వాడు మాకు పెంకులివ్వడు. ఇస్తే వాడిక వర్తకం కట్టిపెట్టుకోవాలి. రాజాగారితో సంబంధం వున్న పెద్దమనుష్యులెవరూ మా యింటికేసి కూడా చూడరు ఎక్కడేనా కనపడితే దూరంగా తొలగిపోతారు మాకే గాక మరి కొందరికి కూడా యిలాంటి చిక్కులున్నాయి. మీరు మరోచోట బస పెట్టుకుంటే పని జరిగివుండు" నని పంతులుగారన్నారు దానికి నేను "తమ దర్శనం కోసం వచ్చాను మరేమీ పనిలేదు; వచ్చాను కనక యిదివరకే తమద్వారా చందాదారులై వున్న వారిని చూస్తాను" అని రాసి చూపించాను. పంతులుగారు సంతోషించారు; కాని "మాటలవల్ల పనులు జరుగుతాయా? సరే మరీ. కష్టపడండి. దేశీయులు మీ సేవను గుర్తిస్తారు. కొంతవరకూ గుర్తించి కూడా వున్నారు." అని చెబుతూ మళ్ళీ వీరేశలింగం పంతులుగారి ప్రస్తావన అందుకున్నారు

"వీరేశలింగం పంతులుగారు పండితులనడానికి వీలులేదు; కాని పండితులే. చెయ్యవలసిన పనులెన్నో చేశారు వారు చేసిన పనులు మరెవ్వరూ చెయ్యలేక పోయారు కూడాను. వారు చివరికి, నా వాదం అంగీకరించారు. వెంటనే వారి ఆనందాశ్రమంలో వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం యేర్పరచబడ్డది. దానికి పంతులుగారే అధ్యక్షులు. అప్పటికి వారు ఆంధ్రకవుల చరిత్ర సంస్కరిస్తున్నారు మద్రాసు ప్రయాణం తొందరలో కూడా వున్నారు. "ఈ పని పూర్తి కాగానే నేనీ సమాజం పని శ్రద్ధగాచేస్తా" నని చెబుతూ వారు మద్రాసు వెళ్ళారు; కాని కొద్దిరోజుల్లోనే వారక్కడ కాలం చేశారు. ఈ సంగతులన్నీ తెలుపుతూ శిలా విగ్రహ ప్రతిష్ఠకు ప్రధాన పురుషులైన పెద్దాడ సుందర శివరావు గారికి నేను జాబు రాశాను. వారు దాన్ని ఆ సభలో చదువుతారని నమ్ముతున్నా" నన్నారు పంతులుగారు.

అప్పటికి రాత్రి పది గంటలుదాటింది. పంతులుగారింకా మాట్లాడ గలిగేటట్టే వున్నారు; కాని ప్రయాణపు బడలికవల్ల నాకంతకుముందే నిద్రమత్తు ప్రారభమయి వుంది. అది చూసి. వారు, నాకు, "పడుకో" మని సెలవిచ్చారు.

నవంబరు 24 :—

సూర్యోదయం అయ్యే అప్పటికే

పంతులుగారు కాలకృత్యాలు తీర్చుకొని సిద్ధంగా వున్నారు. మరో అరగంటకి నేను తెమిలాను. మాతృశ్రీ గారిచ్చిన కాఫీ పుచ్చుకొని యిద్దరమూ మేడమీదకి వెళ్ళిపోయాము

పంతులుగారు నన్ను, రెండో గదికి తీసుకువెళ్ళి ఉత్తమ ప్రబంధాలున్నా బీరువా తెరిచారు. భారతం, భాగవతం-రామాయణం, మను వసు చరిత్రాదులు, ఏవితీసినా పరిష్కర్తల తెలివి తక్కువ సవరణలు ప్రతీ పేజీలోనూ గుర్తు పెట్టబడి వున్నాయి. కవిసార్వభౌముని శ్రీకృష్ణ భారతం కనపడింది ఎర్రపెన్సిలుతో గీటు పెట్టని పంక్తి కనపడలేదు. వావిలాల వాసుదేవశాస్త్రిగారి ఉత్తరరామ చరిత్ర కొత్త మార్పు కనపడింది అక్షరం అక్షరానికీ గీట్లున్నాయి. ఒకచోట శాస్త్రిగారు "హాని పొసగదు" అని వాడారు. అది చూపించి, నవ్వుతూ "శాస్త్రిగారికి పొసగు ధాతువు అర్థం తెలవదు దాని ప్రయోగం అసలే తెలవదు అయినా ఉత్తర రామ చరిత్ర తెనిగించారు అయితే; వారి రచనలో వ్యావహారిక శబ్దాలు కుప్పలుగా వున్నాయి. తెలిసి వుండేవారు వాటిని వాడారని నేను చెప్పగల"నన్నారు పంతులుగారు.

వడ్డాది సుబ్బరాయుడుగారి ప్రస్తావన వచ్చింది "శబ్ద రత్నాకరం లేనిదే వారు మాట్లాడ" రని చెబుతూ పంతులుగారు, నన్ను, మొదటి గదికి తీసుకు వెళ్ళి శబ్ద రత్నాకరం ముందుపడేశారు

. చూస్తి ని గదా, బలమైన దారంతో అది గట్టిగా కట్టబడి వుంది విప్పగా, ఏ అట్టకా అట్ట, ఏ కాగితానికా కాగితమూ విడిపోయి వరసగా మాత్రం వున్నాయి. అందులో తప్పులేని శబ్దం కనపడ్డంచాలా కష్టమయింది. ప్రతీ పేజీలోనూ అచ్చు భాగం కంటే పెన్సలుతో రాసిన భాగమే హెచ్చుగావుంది అది మళ్ళీ యథాప్రకారంగా కట్టేస్తూపంతులుగారిలా చెప్పారు.

ఇద్దరమూ నుంచునే వున్నాం. "తమరు కూచోండి" అని కుర్చీ దగ్గరికి లాగాను, కాని "నుంచుని మాట్లాడడమే నా కలవాటు" అంటూ వారలాగే వుండి మాట్లాడారు.

"ఇటీవల నేను, శబ్దరత్నాకరం మరో ప్రతి కూడా కొని, తెల్లకాగితాలు చేర్చి బైండు చేయించి వున్నాను, కాని నేను యీ ప్రతిని నా ప్రాణంకంటే ఎక్కువగా కాపాడుకుంటున్నాను. ఒకప్పుడొక సన్నివేశం తటస్థించింది ఒక సందర్భంలో మరికొన్ని పుస్తకాలతో పాటు ఇది కూడా పట్టుకుని రాజమహేంద్రవరం వెళ్ళాను. అక్కడ డాక్టరు చిలుకూరి నారాయణరావుగారి యింట్లో బస పని పూర్తి అయాక ఇంటికి వచ్చి చూడగా పెట్టెలో శబ్దరత్నాకరం కనపడలేదు ప్రయాణం తొందరలో అది అక్కడే వుండిపోయింది అది లేకపోవడంవల్ల నాకు మతిపోయింది అంచేత "అది మళ్ళీ నా చేతికి వచ్చేదాకా నేనుభోజనం చెయ్య"నని శపథం తాల్చాను. ఈ సంగతి తెలుపుతూ వెంటనే సీతాపతి నారాయణరావుకి టెలిగ్రామిచ్చాడు దానికి నారాయణరావు "అవును. అది యిక్కడ కనపడింది. వెంటనే పార్సలు చేసి పంపేశాను. ఈ పాటికి సగం దారిలో వుంటుంది." అని బదులు తంతి కొట్టాడు.

అప్పుడు మా వాళ్ళు, బోధించి, బతిమాలగా నేను భోజనం చేశాను. అయితే ఈ పుస్తకం అంటే నాకింత శ్రద్ధ ఎందుకో మీకు తెలుసునా?"

ఇలా అడుగుతూ, పంతులుగారు, మరింత దగ్గిరగా వచ్చి తమ రెండు చేతులూ నా భుజాలమీదవేసి వూపుతూ— వొత్తి వొత్తి పలుకుతూ—

"మీరు బాగా వినండి. గట్టిగా నమ్మండి నేనిదివరకి చేసిందలా వుండనియ్యండి నేనింకోపనిచెయ్యవలసివుంది. అది చెయ్యకుండా నేనీ శరీరం విడిచిపెట్టను ఇది నా ఇచ్ఛకు వ్యతిరేకంగా జరగదు... ఆంధ్ర సాహిత్య పరిషత్తు యొక్క స్థితిగతులు మీకు బాగా తెలుసు. జయంతి రామయ్యగారు దాని చిగుళ్ళన్నీ చిదిమేశారుఇప్పటికీచిదిమేస్తూనేఉన్నారు. అది పూర్తిగా గిడసబారి పోయింది దానికింక యెదుగు బొదుగులు లేవు. అది యిక చిగిర్చదు పుయ్యదు, కాయదు, ఫలించదు ఇక రామయ్యగారు ఆశపెట్టుకున్నదల్లా సూర్యరాయాంధ్ర నిఘంటువు దేశం కనిపెట్టుకుని వున్నది దానికోసమే అయితే: అది శబ్దరత్నాకరం మీద ఇంప్రువుమెంటుతప్ప స్వతంత్రం కాదు సమగ్రం అంతకంటే కాదు. నిరుషం కానేకాదు. కావడానికి తగిన సన్నివేశాలక్కడ లేనేలేవు. అది అచ్చులో వుందని తేలుస్తుంది కనక యెప్పటికేనా బయటికి వొస్తుంది. నేను దానికోసం యెదురు చూస్తున్నాను. వచ్చి రావడంతోటే దాన్ని నేను ముక్కాచెక్కా కింద చితక్కొట్టేస్తాను. అందుకోసమే యీ శబ్దరత్నాకరం యింత జాగ్రత్తగా వుంచాను. దీన్ని అనుసరించి వెడుతుంది కనుక అది, దాన్ని విమర్శించాలంటే దీనిమీద రాసి వుంచిన నోట్సు చాలా అవసరం. తరవాత దీని పని తీరిపోతుంది. ఇంత పని చేస్తేగాని కృతకాంధ్రం యొక్క దౌర్బల్యమూ దౌర్భాగ్యమూ విదేశీయులకు పూర్తిగా బోధపడవు. నిఘంటువు రాయడాని కెలాంటి వారు పూనుకోవాలో, వారి హృదయం యెంత విశాలమయినది కావాలో, సంకుచిత భావాలతో పూనుకుంటే అది ఎలాగ నిరర్థకం అయిపోతుందో, జీవద్భాషను విడిచిపెట్టి నిఘంటువు రాయడం యెంత శవాలంకరణమో దేశీయులకు బోధపడడం చాలా అవసరం యేది జరిగినా యేది జరగకపోయినా నేనిది మాత్రం చేసి తీరతాను మీరు చూస్తారు"

పంతులుగారీ మాట ఉచ్చరించాటప్పుడు వారి ముఖంమీద దివ్య తేజస్సు మెరిసిపోయింది

తరవాత పంతులుగారు, కుర్చీలో చేరబడి వొక్క క్షణానికి చిత్తాన్ని సమాహితం చేసుకున్నారు ఈ లోపుగా నేను పలక మీద వొక ప్రశ్నరాసి వారి కందించాను

నా రచన లెంతో వుబలాటంతో చదివే ప్రియమిత్రులు, భావరాజు వెంకట కృష్ణారావు పంతులుగారు నాలుగైదు మాట్లు నాకొక సలహా చెప్పి వున్నారు; కాని దాన్ని నేనింతవరకూ అంగీకరింపలేకపోతూనే వచ్చాను. అయితే: ఇటీవల రామమూర్తి పంతులుగారికి రాసి యీ విషయం పరిష్కరించు కోవాలను

కుంటూ—దీని సందర్భంలో కూడా శ్రద్ధ చెయ్యలేక పోయాను.

"రాశాను"

"కోసెడు దూరం"

"బాగా వుంది"

"అది చూసి వొకడు"

ఇలా రాయడం మంచిది కాదంటారు కృష్ణారావు పంతులుగారు "వ్రాశాను" "క్రోసెడు దూరం" "బాగా ఉంది" "అది చూసి ఒకడు" అనకూడదా అంటారు వారు "అసలు వ్యావహారిక భాషను ప్రవేశపెట్టిన రామమూర్తి పంతులుగారు మీరు రాసినట్టు రాస్తారా?" అనికూడా అడిగారు.

రామమూర్తి పంతులుగారికి నేను రాసి చూపించిన విషయం యిదీ దీని మీద పంతులుగారిలా సెలవిచ్చారు.

సుబ్రహ్మణ్యశాస్త్రి రాసినట్టు రామమూర్తి రాయడు. రామమూర్తి రాసినట్టు సుబ్రహ్మణ్యశాస్త్రి యెందుకు రాయాలి? కృష్ణాగారిని మీరిలా అడగండి. నేనడగమన్నానని మరీ అడగండి. ఇందులో వున్న కిటుకేమిటంటే? నేను రాయమన్నది శిష్ట వ్యావహారికం. శిష్టులందరూ "రాశాను" అంటారు కాని "వ్రాశాను" అనరు. అనకపోతే లోపమున్నూ లేదు. నేను గ్రాంధికంలో పుట్టి పెరిగాను. ఆ వాసన యింకా నన్ను వదలలేదు. పూర్వులు వ్యాఖ్యానాలు వగైరాలలో వాడిన శబ్దాలను వాడడమే నా కలవాట యింది మీరు శిష్ట వ్యావహారికాన్ని స్వీకరిస్తున్నారు. అది చాలా మంచి పని. నేనలా రాయకపోయినా మిమ్మల్ని ఆక్షేపించను. మీ రచనలలో జాతీయత వుంది. మీరు వాడే శబ్దాల వల్ల ఆ జాతీయత కేమీ భంగం కలగడం లేదు. శిష్ట వ్యావహారంలో వున్న భాష వాడాలి" అని మీరు జ్ఞాపకం వుంచుకున్నంత కాలమూ మిమ్మల్ని నేనేమీ ఆక్షేపించను."

ఈ సమాధానం కృష్ణారావు పంతులుగారి కిష్టమవుతుందో కాదో నేను చెప్పలేను, కాని నాకు మాత్రం చాలా వుత్సాహం కలిగించింది.

ఈ సమయంలో "వంట అయిం" దని మాతృశ్రీగారి దగ్గరనుంచి కబురు వచ్చింది. మడికట్టుకుని యిద్దరమూ భోజనాల గదిలోకి వెళ్ళాము,

భోజనానంతరం మళ్ళీ మేడ మీదకి వెళ్ళాము. పంతులుగారు ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ వగైరా పాశ్చాత్య భాషల గ్రంథాలున్న బీరువా తెరిచారు అందులో ఉన్నవన్నీ భాషాతత్వ శాస్త్రానికీ, వ్యాకరణానికీ, ఆయా వాఙ్మయాల చరిత్రలకూ సంబంధించిన గ్రంథాలు. నేను యదాలాభంగా వొక పుస్తకం తీశాను విప్పి చూడగా అది ఫ్రెంచి భాషా తత్వ శాస్త్రానికి సంబంధించిన గ్రంథం. చాలా విలువయింది. ప్రామాణ్యం కలది కూడానూ. అందులో వొక పేజీ అంతటా పెన్సిలుతో పెట్టిన కొంకిర బింకిరి గీతలున్నాయి. ఇదేమని నేనడగడానికి ముందే పంతులుగారు, వాటిని చూపిస్తూ యిలా చెప్పారు.

"మీరు, నా కుమారుడు సూర్యనారాయణ నెరుగుదురు అతని కుమారుడు—పదెనిమిదేళ్ళవాడు—మీ రెరుగుదురు. రాజమహేంద్రవరంలో జరిగిన ఆధునికాంధ్ర

సభలో అధ్యక్షులవారి టేబిలు మీద కూచుని దీక్షితులు గారి లీలాసుందరి కథ చదివాడు. ఏం? బాగా జ్ఞాపకం ....? వాడు గీశాడు ఆ గీతలు, నేనో నాడు దీక్షగా వొక పుస్తకం చదువుతున్నాను. పక్కని కూచుని యెప్పుడు తెరిచాడో యిది చల్లగా గీసేస్తున్నాడు. నేను చూశా టప్పటికొక పేజి నిండిపోయింది. కాస్త ఆలస్యమయితే: మరో పేజీకూడా అయి పోవును అయితే నన్ను చూసి, వాడు, తెల్లపోయాడు ఏం చెయ్యను? పుస్తకం గొప్పది. చేసిన పని కలిసిరాంది. చేసిన వాడు మనవడు. కోపం వచ్చింది; కాని వాత్సల్యంలో లీనం అయిపోయింది. చెయ్యెత్తాను, కాని వేళ్ళు వాడి ముంగు రులు సవరించాయి. ఇంకెందుకూ? కొట్ట లేక పోయాను గదుమలేక పోయాను. కళ్ళెర్రజేయడం కూడా పడింది కాదు కాని కొంతసేపటికి గాంభీర్యం తెచ్చిపెట్టు కుని "శ్రద్ధగా చదువుకుంటానంటే- ఈ పుస్తకం చదవగలిగేటంతవరకూ చదువు కుంటానంటే- అప్పుడీ పుస్తకమే చదు వుతా నంటే నిన్నిప్పుడు కొట్టను ఏం? ఏమంటావు? .... ?" అన్నాను దీంతో వాడికి ప్రాణాలు కుదుట బడ్డాయి. వెంటనే వాడు చాలా చురుకైన వాడు లెండి. ఉచితానుచితాలు బాగా తెలిసిన వాడవు తాడు. ఏమీ సందేహంలేదు, వెంటనే రెండు చేతులూ జోడించి "చదువు కుంటా" నన్నాడు. నా గాంభీర్యమంతా యేమయిపోయిందో పోయింది. హృదయం ఆనంద మయమయిపోయింది. వెంటనే వాణ్ణి వొక్కమాటు వొళ్ళోకి తీసుకుని హృదయాని కదుముకుని "వెళ్ళి ఆడుకో" అన్నాను వాడికి కూడా భయం పోయి ఉత్సాహం కలిగింది. వెంటనే యెగురుతూ దుముకుతూ కిందికి వెళ్ళిపోయాడు. వాడెప్పుడేనా యీ బీరువా దగ్గరకు వచ్చి నపుడు ఏమండీ నేను చదువుకునే పుస్తకం యిందులో వుంది కా?" అంటూ వుంటాడు. నాకేమీ సందేహం లేదు వాడు అంతటివాడవుతాడు."

ఈ మాటలు చెప్పేటప్పుడు పంతులు గారి కళ్ళల్లో ఆనందం సుడి తిరిగి పోయింది.

తరవాత వొక్క అరగంటదాకా ఆ మాటా యీ మాటా చెప్పుకున్నాము. ఆ సమయంలో డాక్టరు పోచిరాజు వైకుంఠం పంతులుగారూ, కెంబావి శ్రీనివాసరావు పంతులుగారు వచ్చారు. నలుగురమూ డాబామీద కూర్చున్నాము. పంతులుగారు వారికి నా సంగతి స్వయంగా చెప్పారు. నేను రాసిన ప్రేమపాశం సంగతి యెత్తుకుని దానిని గురించి వారితో చాలా ప్రీతితో మాట్లాడారు. మరికొంతసేపటికి పంతుళ్ళు వారిద్దరూ కచేరీలో పనివుండి వెళ్ళి పోయారు. రామమూర్తి పంతులుగారు చెప్పగా వారి వెనకనే నేను వూళ్ళోకి వెళ్ళాను.

నలుగురు యువకులు కొత్తగా చందా దారులయినారు. డాక్టరు పోచిరాజు వైకుంఠంపంతులుగారు ఐదురూపాయిలు విరాళం యిచ్చారు. జి. భాస్కర రామ చంద్రరావు (ఉలవభద్ర) దొరగారూ, కెంబావి శ్రీనివాసరావు పంతులుగారూ విరాళాలు వాగ్దానం చేసి "వారం పది రోజుల్లో పంపుతా"మన్నారు.

పొద్దుగూకింది. చీకటి పడింది. బసకి వచ్చాను పంతులుగారు లఘువుగా ఫలహారమూ, నేను భోజనమూ చేశాము.

మళ్ళీ యథాప్రకారంగా మేడమీదకి వెళ్ళాము

ఎందరో పండితుల ప్రస్తావన వచ్చింది. పంతులుగారు, ఆ పండితుల అపప్రయోగాలు వివరిస్తూ ఎంత విలువయిన పాఠాలో చెప్పారు

మాటలో మాట మన తెనుగువారి దేశసేవ ప్రస్తావన వచ్చింది. ఎన్నో సంగతులు వెళ్ళిపోయాయి ఈ సందర్భంలో పంతులుగారు హృదయవిదారకమైన ఒక సంగతి సెలవిచ్చారు.

అది తలుచుకుంటే యిప్పటికీ ఒళ్ళు జలదరిస్తోంది

ఓఢ్రుల దురాక్రమణ సందర్భంలో మనం చూపిన ఔదాసీన్యంవల్ల — కాంగ్రెస్సుపేర ప్రదర్శించిన చచ్చు ఔదార్యంవల్ల శుద్ధాంధ్ర సోదరీసోదరులు సుమారు మూడు లక్షలమంది ఓఢ్ర రాష్ట్రంలోకి లాగివెయ్యబడ్డారు.

దీనివల్ల వచ్చిన ఆపదేమిటంటే ?

మనతోపాటు మెజారిటీ సౌకర్యాలనుభవించవలసిన మూడు లక్షల తెనుగువారు ఓఢ్రుల పంజాలో చిక్కుకుని మైనారిటీలో పడిపోయారు. తద్వారా — యిక్కడ — మనకి కూడా అరవల యెదట మైనారిటీ వచ్చింది

ఇంతేకాదు.

దీనివల్ల మాననధనులైన శ్రీరామమూర్తి పంతులుగారికి, నమ్మి, ప్రాయం అంతా గడిపిన వూళ్ళో — పదివేలుపోసి కట్టుకుని యాభైయేళ్ళనుంచి కాపరం వున్న యింట్లోవుండే యోగం లేకుండా పోతోంది.

సంగతేమిటంటే ?

1936 వ సంవత్సరం ఏప్రిల్ నెల మొదటి తేదీని పర్లాకిమిడి పట్నం ఓఢ్ర రాష్ట్రంలో చేరిపోతుంది. అయితే పంతులుగారు ఓఢ్ర రాష్ట్రీయ పౌరులనిపించుకోడానికిష్ట పడడంలేదు.

వారు సెలవిచ్చిందిదీ.

కొన్ని గడియలనూ ఓఢ్ర రాష్ట్రీయచ్ఛాయ అలుముకుంటుందనగా, నేను, పర్లాకిమిడి విడిచిపెట్టి మద్రాసు ప్రెసిడెన్సీలోకి వచ్చేస్తాను. అయితే పర్లాకిమిడి సేషనులో రైలెక్కాను పాతపట్నం వెళ్ళి, ఏటిలో స్నానంచేసి, పర్లాకిమిడి మళ్ళీ మద్రాసు ప్రెశిడెన్సీలో చేరితే తప్ప లేకపోతే ఆ వూళ్ళో — బతికివుండగా నేనా వూళ్ళో అడుగుపెట్టనని కంకణం కట్టుకొని రైలెక్కుతాను అయితే, రైలెక్కి ఏవూరు వెళ్ళడం ? ఈ వృద్ధాప్యంలో నాకెక్కడ సుఖంగా వుంటుంది ? భాషా పరిశ్రమ చేసుకోడానికి నాకేవూళ్ళో అవకాశాలున్నాయి ?"

పంతులుగారు తలవూపుతూ ప్రశ్నార్థకంగా చూశారు.

వెంటనే నేను, మా రాజమంహేంద్రవరం దయచెయ్యవలసిందని ప్రార్థించాను. "మావూళ్ళో గౌతమి పేరిట పెద్ద పుస్తక భాండాగారం వుంది. మీ కుమారుడు గారు మా వూళ్ళోనే ఉద్యోగంలో వున్నారు తాను గీతలు గీసిన ఫ్రెంచి పుస్తకం పెద్దపెరిగాక చదువుతానని మాట యిచ్చిన మీ మనుమడు కూడా మావూళ్ళో వున్నాడు మీ శిష్యపరమాణువులం మేము కూడా ఉన్నాము. గోదావరి ఒడ్డు కావాలంటారా, ఇన్నిస్‌పేటలో వుండండి. విశాలమైన వీధులతో

జనసమర్థంలేని స్థలం కావాలంటారో దానవాయి ,ంటలో వుంటంది, దీక్షితులు గారు షష్టి గడియలూ మిమ్మల్ని కని పెట్టుకునే వుంటారు. గౌతమీ ఖాండాగారం దగ్గిరకూడా చాలా మంచి యిళ్ళున్నాయి. మీ యిష్టం. రాజమహేంద్రవరమే మీరు దయచెయ్యాలి" అని నేను మరీ మరీ కోరాను

పంతులుగారు తలవూపారు బాగుందన్నారు ప్రస్తుతం అంతకంటె మంచిది కనపడ్డంలేదని కూడా అన్నారు.

విశాఖపట్నంలో, కవిగారి షష్టిపూర్తి మహోత్సవ సభలో వుపన్యసిస్తూ సభలో కూచునివున్న డాక్టరు పాలకోడేటి గురుమూర్తి పంతులుగారినీ అగ్రాసనంలో ఉన్న న్యాయపతి సుబ్బారావు పంతులుగారినీ సంబోధించి నేనీ సంగతి చెప్పాను.

పంతులుగారి శపథం విన్నప్పుడు నిజంగా నాకు శరీరం అవశ్యం అయినట్లయి పోయింది.

ఏమనుకుంటే యేముంది?

తెనుగువాడిప్పుడు భావదాస్యంలో మగ్గిపోయి ఆత్మగౌరవం యెరక్కుండా వున్నాడు. పాము నోట్లో వున్న కప్ప కబళించే దోమగా వున్నాడు.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు.

మర్నాడు - యిరవై అయిదో తేదీ వుదయం ఎనిమిది గంటలవేళ పంతులుగారికి పాదాభివందనం చేసి, మాతృశ్రీ గారికి కూడా నమస్కారాలు చెప్పుకుని, ఆ గురు దంపతుల దీవెనలు శిరసావహించి, స్టేషనుకి వచ్చి రైలెక్కాను.

రైలు కూడా నాలాగే మందకొడిగా వుండి ఎనిమిది గంటలకు పర్లాకిమిడిలో బయలుదేరింది పది కొట్టాక నౌపడా స్టేషను చేరింది

ప్రబుద్ధాంధ్ర 10 డిసెంబర్ 1935
(6వ సంపుటం, 12 వ సంచిక)

With best compliments from :

Grams · PICASSO

Phones · 4282, 4283, 5679
Telex 0495-252

COROMANDEL PAINTS & CHEMICALS LTD.

10-1-20, Waltair Uplands :: Visakhapatnam-530 003

Manufacturers of :

All Varieties of Paints - Decorative, Industrial, Marine and other Sophisticated coatings.

Regd. Offi.: 9-30-2, Siripuram, Visakhapatnam-3, Phone:3249

Works : Pendurty, Vizag Dist. Phones : 9263 & 9254